# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 11, ఆగస్టు 2026


## సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

**- పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**బజార్‌హత్నూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**
బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో మరింత సమర్థవంతంగా పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామాలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా, పేకాట, మట్కా వంటి వాటిని పూర్తిగా రూపుమాపాలన్నారు. వర్టికల్స్ విధానాన్ని అమలు చేస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని, నకిలీ నంబర్ ప్లేట్లతో తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ జీ. రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల కట్టడికి నిర్మల్ పోలీసుల కొత్త వ్యూహం

**పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయండి: ఎస్పీ జానకి షర్మి**

**నిర్మల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**




జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసేందుకు నిర్మల్ పోలీసులు నడుం బిగించారు. నేరాల సంఖ్య తగ్గించడం, బాధితులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల కీలక ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, పోలీసు స్టేషన్ల ఎస్హెచ్ఓలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా నలుగుతున్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, పిల్లల ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఇటీవల పెరుగుతున్న ఇళ్ల చోరీలు, బైక్ చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలపై క్లూస్ టీమ్ సాంకేతిక ఆధారాలు సేకరించాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని మిగతా 2లో..

**కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్రకు**

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి సంఘీభావం

**ఆసిఫాబాద్ టౌన్, ఆగష్టు 10, ప్రభాతావార్త :**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ వాంకిడి మండల కేంద్రం నుంచి ఎర్రవెల్లిలోని కేసీఆర్ సొంత నివాసం వరకు జాడె తిరుపతి, దుర్గం శంకర్ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి సామాజిక వర్గం సంతోషంగా జీవించాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.త్వరలోనే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జాడె తిరుపతి, దుర్గం శంకర్‌ను పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వారిని అభినందిస్తూ మద్దతు ప్రకటించారు. వాంకిడి నుంచి ఎర్రవెల్లి వరకు సాగుతున్న ఈ పాదయాత్రతో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను ఆయన దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు పాదయాత్రికులు తెలిపారు.




## చెట్ల పొదల్లో లభ్యమైన నవజాత శిశువు మృతి

**సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో**

**ఘటన: కేసు నమోదు చేసిన పోలీసులు**

**నస్పూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త**
నస్పూర్ పట్టణంలోని సీసీసీ లక్ష్మీ నగర్‌లో చెట్ల పొదల్లో లభ్యమైన నవజాత మగ శిశువు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్‌హెచ్‌ఓ మేకల ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం శిశువు ఏడుపు విన్న స్థానికుడు గడ్డం వీరేశం 112 అత్యవసర నంబర్‌కు సమాచారం అందించగా, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ మంతెన ప్రేమ్ కుమార్, సూపర్వైజర్ అజిత్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ ద్వారా శిశువును మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం బర్త్ రూట్ ఆసుపత్రికి తరలించారు. అయితే శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశామని, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీసీసీ నస్పూర్ ఎస్‌హెచ్‌ఓ మేకల ప్రశాంత్ తెలిపారు.

## కుభీర్‌లో తీవ్ర విషాదం..

## ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి





**నిర్మల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**
సోమవారం సెలవు కావడంతో సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందారు. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దీంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. కుభీర్ మండల కేంద్రానికి చెందిన సోఫియాన్ (13), దేవ్కర్ గణేష్ (10) మరో స్నేహితుడితో కలిసి సోమవారం స్థానిక డోడర్నా చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్లారు. ముగ్గురిలో ఒక బాలుడు చెరువు ఒడ్డునే ఉండగా.. సోఫియాన్, గణేష్ ఇద్దరూ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే చెరువు లోతును అంచనా వేయలేకపోవడంతో ఇద్దరూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని మిగతా 2లో..

## నేరాల కట్టడికి నిర్మల్ పోలీసుల కొత్త వ్యూహం

**(మొదటిపేజీ తరువాయి)**

ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని, ఫేక్ నెంబర్ ప్లేట్ వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణ, రవీందర్ నాయక్, సమ్మయ్య, సాయి కుమార్, దీపక్, ఆర్.ఐ అడ్మిన్ రామ్ నిరంజన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కుభీర్‌లో తీవ్ర విషాదం..**

## ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి

**(మొదటిపేజీ తరువాయి)**

గమనించిన స్థానికులు వెంటనే చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు బాలురను నీటిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే సోఫియాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర అస్వస్థతకు గురైన గణేష్‌ను చికిత్స నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

**తల్లిదండ్రుల రోదనలు.. కంటతడి పెట్టించిన దృశ్యాలు**

కంటికి రెప్పలా కాపాడుకున్న పిల్లలు కళ్లముందే మృతదేహాలుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గణేష్ మృతదేహాన్ని పట్టుకుని తల్లిదండ్రులు చేసిన ఆర్తనాదాలు అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో కుభీర్ మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ

సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ సాయికిరణ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డిని అడిగి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

## 1990 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు హెచ్‌సీలకు ఏఎస్ఐలుగా పదోన్నతి

**- పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

**నిర్మల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ సేవలందించిన 1990 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్ఐ) పదోన్నతి లభించింది. శాఖాపరమైన పదోన్నతుల్లో భాగంగా మామడ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్‌సీ 1285 ఎస్.ఎస్. చంద్రప్రకాష్, నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్‌సీ 547 ఎస్. చంద్రశేఖర్, సోన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్‌సీ 448 ఏ. సాయన్న ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్‌లు పదోన్నతి పొందిన సిబ్బందికి ర్యాంకులు అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజా సేవలో చూపిన అంకితభావానికి ఈ పదోన్నతి గుర్తింపు అని పేర్కొన్నారు. నూతన హోదాలో మరింత బాధ్యతతో పని చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీతో విధి నిర్వహణ చేపట్టి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి: టీఆర్‌టీఎఫ్

**సారంగాపూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పి.ఆర్.సిని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎన్జీవో భవనంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలాతీతమైనప్పటికీ పి.ఆర్.సిని ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పి.ఆర్.సిని వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆరు డీఏలను మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ గౌరవాధ్యక్షుడు లింగంపల్లి ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, జిల్లా నాయకులు రవికిరణ్, పెంట పవన్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణపై బీజేపీ పోరుబాట

**ఆసిఫాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ మండలం కోసిని శివారులో 'సంకల్పం గ్రీన్ సిటీ' పేరుతో వెంచర్ ఏర్పాటు చేస్తూ, అనుమతులు పొందిన సర్వే నంబర్లకు అదనంగా 79, 80 సర్వే నంబర్లలోని సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన 216, 217, 218 సర్వే నంబర్ల భూములు, శిశుమందిర్‌కు చెందిన భూమి, క్రీడా స్థలంను కూడా ఆక్రమణకు గురైనట్లు పేర్కొన్నారు. అనుమతులు ఒకచోట తీసుకుని హద్దులు మార్చి ప్రభుత్వ భూములను వెంచర్లలో కలిపి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో మరో సారి పూర్తి సమగ్ర విచారణ జరిపి ఆక్రమణలను తొలగించాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ను కలిసి సంకల్పం గ్రీన్ సిటీ వెంచర్ పై విచారణ చేపట్టి రద్దు చేసేలా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లిఖార్జున్, రాష్ట్ర నాయకులు కోట్నాక విజయ్, సెర్ల మురళి, ఖాండ్రె విశాల్, తిరుపతి, సప్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మికులు, రైతుల రాస్తారోకో

**ధరలు పెరుగుతున్నట్లు కార్మికుల వేతనాలు పెంచండి**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, ప్రభాతవార్త**

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మేకల దాసు, దుంపల రంజిత్ సిఐటియు, లాల్ కుమార్ ఏఐకేఎంఎస్, టి. శ్రీనివాస్ ఐఎఫ్టియు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను హరిస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణ విముక్తి, మార్కెట్ సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని, రైతులకు చట్టబద్ధ ఎంఎస్పి కల్పించాలని, ధరలను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ముధోల్ తాలూకా అన్నాభావు సాఠే కమిటీ

**ఎస్సీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల ఫోరం భేటీ**

**నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే**

**భైంసా, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలో ముధోల్ తాలూకా అన్నాభావు సాఠే నూతన కార్యవర్గ సభ్యులతో పాటు ఎస్సీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల ఫోరం కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయాల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. మాదిగల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సమాజ సేవలో ముందుండాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజాక్, అన్నాభావు సాఠే కమిటీ తాలూకా అధ్యక్షుడు నమత్కర్ దిగంబర్, ఉపాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి గోనేకర్ శంకర్, గౌరవాధ్యక్షుడు ఇబిద్కర్ ఆనంద్, కోశాధికారి కొడగంటి శంకర్, ఎస్సీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు షెల్కె ఆనంద్, గౌరవాధ్యక్షురాలు నాగలక్ష్మి వినోద్, ఉపాధ్యక్షురాలు సిర్మాన్ గీతా మహేందర్, ప్రధాన కార్యదర్శి జే. గజేందర్, కార్యదర్శులు లక్ష్మణ్, గోనేకర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిపై త్రివర్ణం.. గుండెల్లో దేశభక్తి!

**- జాతీయ జెండాను ఎగురవేసిన డా. కొత్తపల్లి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :**



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని తమ నివాసం వద్ద జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం ప్రతీ భారతీయుడి గుండెల్లో గర్వాన్ని నింపే ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, ఐక్యత, సమగ్రతకు జాతీయ జెండా ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ఫోరం మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :**

ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ఫోరం–తెలంగాణ కాగజ్‌నగర్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దీపక్ ముండే ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్‌లోని కాపు సంఘ భవన్‌లో కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నెరెళ్ల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కర్ల లావణ్య, మొరాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లోఖండే నరేందర్, కోశాధికారులుగా డొంగ్రే భరద్వాజ్, ముత్తినేని మహేందర్, మీడియా పర్సన్‌గా సోయం లచ్చూ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గడిల నర్సయ్య, కట్టెపల్లి పోశమల్లు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. గ్రామపంచాయతీల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఫోరం తరఫున నిరంతరం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## చిన్నారులు మృతి చెందడం బాధాకరం

**- మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి**

భైంసా, ఆగస్టు 10, ప్రభాతవార్త:

కుబీర్ మండలంలోని దొడర్న చెరువులో ఈతకు వెళ్లి సోఫియాన్, గణేష్ అనే ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటనపై ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం భైంసా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ గోనెలు కళ్యాణ్, కుబీర్ గ్రామ సర్పంచ్ సాయినాథ్, మాజీ సర్పంచ్ విజయ్, మాజీ ఎంపీటీసీ నాగలింగం, మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్, సూది రాజన్న, సాయినాథ్ తదితరులు ఉన్నారు.



## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

భైంసా, ఆగస్టు 10, ప్రభాతవార్త:

మొగిలి గ్రామానికి చెందిన మాధవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, అదే గ్రామానికి చెందిన భుజంగ్ సింగ్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను కలసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భుజంగ్ సింగ్ కారోబారీగా గ్రామానికి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉష దర్శన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి, మాజీ సర్పంచ్ పుండాలిక్, మాజీ ఎంపీటీసీ లచ్చన్న, మాణిక్, ఏ.సాయినాథ్, జే.లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, లక్ష్మణ్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కోలూరు తండా సర్పంచ్ గణేష్, బాబురావు, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వేమనపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం కొత్త కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా దందేర మహేష్ ఏకగ్రీవం - ఐక్యతే లక్ష్యమని ప్రకటన**

వేమనపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త

వేమనపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సుంపుటం ఉప సర్పంచ్ దందేర మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జిల్లెడ ఉప సర్పంచ్ అన్నారం తరుణ్, ప్రధాన కార్యదర్శిగా కేతనపల్లి ఉప సర్పంచ్ గురుండ్ల విష్ణు, కోశాధికారిగా గొర్లపల్లి ఉప సర్పంచ్ గోమాసా శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ఉప సర్పంచుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన మహేష్‌ను పలువురు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, సర్పంచ్‌లు వుప్పులపు సాయికృష్ణ, ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ, మడే శ్రీనివాస్, కొత్రంగి శ్రీనివాస్, ఉప సర్పంచులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమం కోసమే కడెం ఆయకట్టు నీటి విడుదల

**ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం - పాదయాత్ర కాదు, పొర్లు దండాలు పెట్టిన ప్రేమ్ సాగర్ రావును ఎదుర్కోలేరు**

**- సీనియర్ జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి**

లక్షెట్టిపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త



రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని కడెం ఆయకట్టు నీటిని విడుదల చేసినట్లు, పాదయాత్ర, రైతు యాత్ర చేస్తా అన్నందుకు కాదని జిల్లా సీనియర్ నాయకులు గడ్డం త్రిమూర్తి అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు సోమవారం రోజు పట్టణంలోని విశ్రాంతి భవనంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గంలో రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పై గత వారం రోజులుగా ప్రతిపక్షాలైన బిజెపి, బిఆర్ఎస్ అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులకు అత్యవసర పరిస్థితుల్లో నీటిని విడుదల చేయడం మంచిదని సమయం తీసుకున్నారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడ ఉన్న వాస్తవ పరిస్థితిని వివరించి, తమ నియోజకవర్గానికి ఎంత నీరు కావాలి ఎంత అవసరం అని లెక్కలతో సహా వివరించి, తమకు కావాల్సిన నీటిని విడుదల చేసి తమ నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని కోరారు. ఇలా ఎమ్మెల్యే నిరంతరం రైతుల కోసం కృషి చేస్తుంటే ప్రతి పక్షాలు పాదయాత్ర చేస్తాం, రైతు యాత్ర చేస్తాం, అంటూ జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందరూ కలిసి పాదయాత్రనే కాదు, పొర్లు దండాలు చేసిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును ఎదురుకోలేరని హెచ్చరించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ముఖాముఖ నిరూపణ చేసే దమ్ము, ధైర్యం లేని నాయకులు ఇలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడి తమ తమ వైఖరులను మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గడ్డం త్రిమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, ఆర్టిఏ సభ్యులు అంకతి శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

**ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి: బీజేపీ జోనల్ కన్వీనర్ రావుల రాంనాథ్**

నిర్మల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:



భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి 15 వరకు ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా జోనల్ కన్వీనర్, బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడిలో దేశభక్తిని పెంపొందించడం, త్రివర్ణ పతాకం పట్ల గౌరవాన్ని చాటడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలలు, వ్యాపార సముదాయాలపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియా ప్రొఫైల్ ఫోటోలలో జాతీయ జెండాను ఉంచి దేశభక్తిని చాటాలని కోరారు. ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీకి బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ ర్యాలీని ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, కౌన్సిలర్లు గంజి రాజు, జింక సూరి, శ్రీరామోజీ నరేష్, సూరజ్, అర్జున్, సాత్విక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, నాయకులు భరత్, విజయ్, దీక్షిత్, చరణ్ పాల్గొన్నారు.

# 12వ వేతన కమిటీ తక్షణమే ఏర్పాటు చేయాలి: జేఏసీ నాయకులు

**శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముట్టడి, ధర్నా జయప్రదం - వెంటనే చర్చలు ప్రారంభించకపోతే ఉద్యమం ఉధృతం**

నస్పూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త



బొగ్గు గని కార్మికుల వేతనాల పెంపు కోసం 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా, ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. జూలై 1, 2026 నుంచి 12వ వేతన కాల పరిమితి ప్రారంభమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయకుండా జాప్యం చేయడం తీవ్ర నిరక్ష్యానికి నిదర్శనమని సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు పేరం రమేష్, సీఐటీయూ రీజియన్ కార్యదర్శి రామస్వామి, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్ల నిబంధనను సాకుగా చూపి వేతనాల పెంపును వాయిదా వేయడం కార్మికుల హక్కులను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు, అలవెన్సులపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని, వేతన కమిటీ ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ఎస్కే బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, లేగల శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, అశోక్, సీఐటీయూ నాయకులు వెంగళ శ్రీనివాస్, తోడే సుధాకర్, వెంకట్ రెడ్డి, పెరిక సదానందం, శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు వీసా కొమురయ్య, దుర్గం లక్ష్మణ్, నామాల శ్రీనివాస్, గుండ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

## - కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి - సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :**



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. సోమవారం కాగజ్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్‌భరో–రాస్తారోకో నిర్వహించారు. బాలభారతి హైస్కూల్ నుంచి కార్మికులు భారీ ప్రదర్శనగా బయలుదేరి వివిధ మార్గాల మీదుగా రాజీవ్‌గాంధీ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. వీటి అమలుతో కార్మికులకు 12 గంటల పని విధానం వచ్చే ప్రమాదం ఉందని, సామాజిక భద్రతకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. సమ్మె చేసే హక్కులను పరిమితం చేయడంతో పాటు కార్మిక సంఘాల ఏర్పాటు విషయంలో కఠిన నిబంధనలు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ముందస్తు నోటీసు లేకుండానే కార్మికులను తొలగించే విధానానికి అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలు, దిగుమతి విధానాల వల్ల భారత రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని భూపాల్ అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గే విధంగా విధానాలు తీసుకువస్తున్నారని విమర్శించారు. నూతన విద్యుత్ విధానం అమలైతే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రజలకు అందుతున్న జీరో విద్యుత్ బిల్లు పథకం కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చి దానిని వీబీ–జీ రాంజీ చట్టంగా మార్చిందని భూపాల్ తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుందనే నిబంధనతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముంజం శ్రీనివాస్, వెలిశాలి కృష్ణమాచారి, ఈ. శంకర్, ఎన్. పద్మలక్ష్మి, కూసన రాజన్న, మహేష్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, బీఆర్ఎస్‌టీయూ నాయకుడు ఏ. ఓదేలు, ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, 5వ జిల్లా అధ్యక్షురాలు మాచర్ల వినోద, కోశాధికారి షాహీనా, భాగ్య, మల్లేష్, బొర్కుట్ రాజేందర్, ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు పండుగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు షెడ్డు నుంచి నాలుగు ఆవులు చోరీ

### - పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన రైతు

**తాండూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :**



తాండూర్ మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో నాలుగు ఆవులను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం... గోపాల్ రావు పేట గ్రామానికి చెందిన రైతు తుపాకుల తిరుపతి ఆదివారం సాయంత్రం తన మామిడి తోటలోని షెడ్డులోఆవులను కట్టేసి ఇంటికి వెళ్ళాడు. సోమవారం ఉదయం ఆవులకు మేత వేసేందుకు రైతు తోటకు వెళ్లి చూడగా ఆవులు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే బాధితుడు తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టారు. అర్ధరాత్రి పూట వ్యవసాయ తోటల్లోకి చొరబడి పశువులను ఎత్తుకెళ్లడంతో గ్రామంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని ఆవులను చోరీ చేసిన నిందితులను పట్టుకోవాలని రైతు కోరుతున్నారు.

## ఘనంగా త్రివర్ణ పతాక ప్రదర్శన

**ఆసిఫాబాద్ టౌన్ , ఆగష్టు 10, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం త్రివర్ణ పతాక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మీడియా ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మురుమురం రాజు, ప్రధాన కార్యదర్శి సదాశివ్, ప్రింట్ మీడియా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ను బీజేపీ నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక్ విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేర్ల మురళీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్, త్రివర్ణ యాత్ర జిల్లా కన్వీనర్ కాంద్రే విశాల్, కోకన్వీనర్ సప్త శ్రీనివాస్, నవీన్ గౌడ్, బాలకృష్ణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రన్నింగ్ ట్రాక్ చదును పనులు ప్రారంభం

**తాండూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :**



తాండూర్ మండలం మాదారంలోని సింగరేణి లాల్ బహుదూర్ స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ చదును పనులను సోమవారం మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాల నియామకానికి శ్రీకారం చుట్టిందన్నారు. నిరుద్యోగ యువత రన్నింగ్ ప్రాక్టీస్ చేసుకోవడానికి మంచిర్యాల డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రన్నింగ్ ట్రాక్ చదును పనులు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని పట్టుదలతో కష్టపడి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 9 వరకు ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :**

డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువును సెప్టెంబర్ 9 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇప్పటికే 2, 3వ సంవత్సరాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా తమ ట్యూషన్ ఫీజులను సెప్టెంబర్ 9లోగా చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9160144943, 9494314314, 9866398678 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

## గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 80వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానం, ఐఆర్ కోడ్‌లకు నిరసనగా పేపర్ మిల్లు ప్రధాన గేటు ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు గోలెం వెంకటేశం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా ఐఆర్ కోడ్‌లను తీసుకురావడంతో కార్మిక రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు. ఐఆర్ కోడ్‌లను ఆధారంగా చేసుకుని సిర్పూర్ పేపర్ మిల్లు జేకే యాజమాన్యం కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలను నిర్వహించే అధికారం కార్మిక శాఖకు లేదంటూ కాలయాపన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోగర్ల రాములు, ముంజం శ్రీనివాస్, కొత్తకొండ రాజేష్, శీలం రాజమోళి, గోగర్ల శ్యామ్‌రావు, వల్లాల సుభాష్, షెబ్బీర్ పాషా, మహేష్, జే. వెంకటేష్, ఏకే. సింగ్, అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, కోరాళ్ల కృష్ణ, చిట్టవేణి రాజేష్ యాదవ్, కూషన్ రాజన్న, జిల్లా రాఘవులు, అబ్దుల్ నబీ, చారి, నస్పూరి శ్రీనివాస్, రజినీకాంత్, శీలం నరేందర్, పి. చంద్రశేఖర్ తదితరులు, పర్మినెంట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పాల నురగలా జాలువారుతున్న గత్రపల్లె జలపాతం

### కుటుంబసమేతంగా తరలివచ్చిన పర్యాటకులు

### మౌలిక వసతులు కల్పించాలని సందర్శకుల విజ్ఞప్తి

**మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 10, ప్రభాతవార్త**



ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రానికి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న గత్రపల్లె జలపాతానికి సోమవారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వరద నీటితో పాల నురగలా జాలువారుతున్న జలపాతం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. పాఠశాలలకు వరుసగా సెలవులు రావడంతో పలువురు కుటుంబ సభ్యులతో కలిసి జలపాతాన్ని సందర్శించి ప్రవాహాన్ని చూసి పరవశించిపోయారు. యువత, చిన్నారులు జలపాతం వద్ద స్నానాలు చేస్తూ ప్రకృతి రమణీయతను ఆస్వాదించారు. పలువురు బంధుమిత్రులతో కలిసి సమీపంలో సహపంక్తి భోజనాలు చేసి, ఆటపాటలతో సరదాగా గడిపారు. జలధారలను కెమెరాల్లో బంధిస్తూ సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. కాగా, గత్రపల్లె జలపాతానికి వెళ్లడానికి సరైన రహదారి లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జలపాతానికి వెళ్లే మార్గాన్ని నిర్మించడంతో పాటు అక్కడ తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించి మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సందర్శకులు కోరుతున్నారు.

# తాండూర్ ఐబిలో జాతీయ రహదారిపై రాస్తారోకో

**తాండూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

జైల్ భరో నిరసన కార్యక్రమాల్లో భాగంగా తాండూర్ మండల కేంద్రంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం నుండి ఐబి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వేల్పుల శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్నటువంటి 44 చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్మిక వర్గానికి ఇబ్బందులు, అన్యాయం చేసే నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకువచ్చిందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దు చేసి, యధావిధిగా 44 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలన్నారు. ఆదివాసి గిరిజనులు, ఇతర కులాలు రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను, కార్మికులను పోలీసులు బలవంతంగా తొలగించారు. ఈ కార్యక్రమంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.





## తిరంగయాత్ర విజయవంతం కోసం బీజేపీ సమీక్ష సమావేశం

బెల్లంపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకుల సూచనల మేరకు బెల్లంపల్లి పట్టణంలో తిరంగయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ధార కళ్యాణి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, జిల్లా ఇన్‌చార్జ్ కన్నబోయిన ఓదెలు సూచనల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఈ నెల 11 నుండి 15 వరకు నిర్వహించనున్న తిరంగయాత్ర కార్యక్రమాలపై పట్టణ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి పట్టణ తిరంగయాత్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకట కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కునిరాజుల అరవింద్, పట్టణ ఉపాధ్యక్షులు సల్లం సుమలత, బాసబోయిన యుగేందర్, గాండ్ల మహేష్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి, సీనియర్ నాయకులు ఆకుల శంకర్, నవీన్, భాగ్మోహన్, ఎర్రోజు శ్రీనివాస్, ఇప్ప స్వామి, పుల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.



గోలేటిలో జిఎం కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



ఏరియా జిఎం శ్రీ రమేష్ కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

# 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

**- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి - జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిఎం కార్యాలయం ముందు ధర్నా**

తాండూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :

12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, వేజ్ బోర్డు చర్చలను ప్రారంభించాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు సోమవారం ఏఐటియుసి, ఐఎన్టియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెంచి వారి జీవన ప్రమాణాలను కాపాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో కార్మికులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకుని, కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, హక్కులు కల్పించాలని నాయకులు స్పష్టం చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ధర్నా అనంతరం ఏరియా జిఎం శ్రీరమేష్ కు జాతీయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఐఎన్టియుసి బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్, హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజబాబు, నాయకులు జగ్గయ్య జూపాక రాజేష్, మారం శ్రీనివాస్, కిరణ్ బాబు, చంద్రశేఖర్, మాసాడి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి రూ. 5 లక్షల ఎల్‌ఓసీ అందజేత

**ఆపదలో అండగా నిలిచిన మంత్రి వివేక్ వెంకటస్వామి**

చెన్నూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించలేని కుటుంబ సభ్యులు ఈ సమస్యను స్థానిక నాయకుల ద్వారా మంత్రి వివేక్ వెంకట స్వామి దృష్టికి తీసుకెల్లగా మంత్రి వెంటనే స్పందించి ఎల్ఓసీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలోని 8వ వార్డు ఎమ్మెల్యే కాలనీకి చెందిన నెన్నెల చిన్నరాజం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయి అత్యవసర శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి ఆర్థిక స్థితి బాగా లేకపోవడంతో 8వ వార్డు కౌన్సిలర్ సుంకరి శిరీష-సంతోష్ వెంటనే స్పందించి ఈ విషయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి పరిస్థితిపై వెంటనే స్పందించిన మంత్రి వివేక్ శస్త్ర చికిత్స నిమిత్తం బాధితుడి కుటుంబానికి రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను మంజూరు చేసి స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఎల్ఓసీ అందడంతో బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

**డీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి**

సారంగాపూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీల ఏర్పాటు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు సమిష్టిగా పనిచేయాలని, త్వరలోనే మండల, అనుబంధ విభాగాల కమిటీల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కౌట్ల, బి.ఆలూరు పిఏసిఎస్ చైర్మన్లు అయిర నారాయణ రెడ్డి, మాణిక్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి మాధవరావు, స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్న, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ రాందాస్, కోశాధికారి దశరథ్ రాజేశ్వర్, నాయకులు భోజగౌడ్, బొల్లోజు నర్సయ్య, నర్సా రెడ్డి, ఉట్ల రాజేశ్వర్, సాక్ పెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.





## నిర్మల్ బుద్ధ విహార్ అభివృద్ధికి కృషి చేస్తా

**- వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి హామీ**

నిర్మల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

నిర్మల్ పట్టణంలోని బుద్ధ విహార్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి హామీ ఇచ్చారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బుద్ధ విహార్ కమిటీ నాయకులు వైస్ చైర్మన్‌ను కలిశారు. విహార్ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. బుద్ధ విహార్ అభివృద్ధి తన ప్రాధాన్యతల్లో ఒకటని పేర్కొన్నారు. కమిటీ సమర్పించిన వినతులను పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షుడు కుంటొల్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి మధుకర్ మునేశ్వర్, గౌరవ సలహాదారులు సుదర్శన్ బౌద్ధ్, దేవుళ్ల గంగాధర్, జాడే భీమ్‌రావు, కాంగ్రెస్ నాయకుడు మూడుసు సత్యనారాయణ, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొంతం మురళీధర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈరోల పురుషోత్తం, కౌన్సిలర్లు కత్తి నరేందర్, నల్లూరి పోశెట్టి, కార్యవర్గ సభ్యులు భగత్ నారాయణ, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

సారంగాపూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

మండలంలోని కరుణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ సంపర్క్ ప్రముఖ కొట్టూరి శ్రీధర్, సంఘ ప్రముఖ శివశంకర్, జిల్లా సంఘచాలక్ నూకల విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. హిందూ యువ సమ్మేళనాలు నిర్వహించి హిందూ సంప్రదాయాలను, సంస్కృతిని భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి, జాతీయ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యం గురించి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, పాఠశాలల్లో ఆచార సంప్రదాయాలను బోధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్ఎస్ఎస్ నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వామపక్షాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం

చెన్నూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో సోమవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక రావిచెట్టు వాడ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వామపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజలపై భారాలు తగ్గించి, ఉపాధి అవకాశాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.